# మరుగుపడ్డ మాణిక్యం

గులేబకావళి కథ అనగానే ముందు గుర్తుకొచ్చేది సినారె సినీప్రస్థానం; *నన్ను దోచుకొందువటే వన్నెల దొరసానీ, సలామలేకుం సాహెబుగారూ, మదనా సుందర నాదొరా* ... లాంటి యిప్పటికీ జన రంజకమైన వారి పాటలు. ఈ పాటల అడుగున మరుగుపడ్డ మరో మాణిక్యం – *కలల అలలపై తేలెను మనసు మల్లెపూవై* అంటూ సాగే సుమనోహర గీతం. అంతకుముందు ఇల్లరికం, జయభేరి సినిమాల్లో స్టేజి మీద సవాలు, ప్రతిసవాలుగా సాగే యుగళ గీతాలు ప్రశ్న–జవాబుల రూపాన్ని సహజంగానే సంత రించుకున్నాయి. అయితే శృంగార ప్రధానమైన యుగళగీతాన్ని కూడా ఆ రూపంలో కూర్చి మెప్పించిన ఘనత సినారెగారిది. అంతేకాదు, సంవత్సరం తరవాత, 1963లో లక్షాధికారి చిత్రంలో *మబ్బులో ఏముంది నా మనసులో ఏముంది?* పాటలో మళ్ళీ అదే ప్రయోగంతో భళా అనిపించుకున్నారు.

అంధుడైన తండ్రికి చూపు తెప్పించడం కోసం దేవలోకం నించి గులేబకాళి పుష్పం తేవాలని నాయకుడు వెళ్ళి, నిద్రిస్తున్న చక్కటి దేవకన్య (నటి పేరు నాగరత్నం అనుకుంటా) అక్కడ కనబడితే ఆమె బుగ్గలకి చందనం అలదుతాడు. దాంతో వులిక్కిపడి కలలలో తేలిపోతూ

**కలల అలలపై తేలెను మనసు మల్లెపూవై**

అంటూ దేవకన్య పాడితే, వెంటనే నాయకుడు

**ఎగసిపోదునో చెలియా నీవే యిక నేనై**

అని అందుకుంటాడు. ఈ పల్లవి వినిపించేది మళ్ళీ పాట చివరలోనే.

తరవాత కొలనులో స్నానం చేస్తూ నీడ రూపంలో నాయకుడు చిలిపిగా తొంగి చూస్తున్నట్టు అనిపించి పెద్ద పెద్ద కళ్ళతో, అమాయకమైన చూపుల్తో, బుంగమూతితో ఆ ముగ్ధ దేవకన్య

**జలకమాడు జవరాలిని చిలిపిగ చూచేవెందుకు?**

అని ప్రశ్నిస్తూ వెంటనే తడిబట్టలతో కొలను వొడ్డుకు రాగానే, నాయకుడు పరిపూర్ణరూపంలో కనిపించి ఆమెనే చూపిస్తూ

**తడిసీ తడియని కొంగున వొడలు దాచుకున్నందుకు**

అని జవాబిస్తాడు. ముఖంలో అమాయకత్వం క్రమంగా తొలగిపోయి కొంటెతనం చేరి, దేవకన్య

**చూపుతోనే హృదయవీణ ఝుమ్మనిపించేవెందుకు?**

అని అడిగితే దానికి నాయకుడి జవాబు

**విరిసీ విరియని పరువము మరులు గొలుపుతున్నందుకు.**

ఈసరికి జాణగా మారిన దేవకన్య

**సడిసవ్వడి వినిపించని నడిరాతిరి ఏమన్నది?**

అడిగినదానికి

**జవరాలిని చెలికానిని జంటకూడి రమ్మన్నది**

అంటూ నాయకుడు ఔచిత్యంగా సమాధానమిస్తాడు. ఇద్దరూ కలిసి శయ్యాగృహానికి దారి తీసి అలంకరించిన పూలపూనుపుని చూపిస్తూ నర్మగర్భంగా దేవకన్య

**విరజాజులు పరిమళించు విరులపానుపేమన్నది?**

అని అడిగితే, నాయకుడు

**అగుపించని ఆనందం బిగికౌగిట కలదన్నది**

అని ముగించగానే దేవకన్య, *కలల అలలపై తేలెను* పల్లవి మరోసారి అందుకుంటుంది. అలా నాలుగు చరణాల్లో ప్రశ్న–జవాబుల రూపంలో కపోలం, అధరం, చుంబనం లాంటి పదాలు వాడకుండానే శృంగారరసాన్ని అంచెలంచెలుగా పరాకాష్టకు చేర్చారు సినారె.

ఇంత చక్కటి సాహిత్యానికి జోసెఫ్–కృష్ణమూర్తి ద్వయం (వాళ్ళకీ అది మొదటి సినిమా) అంతే చక్కటి బాణీ; లలిత లలితమైన నేపథ్య సంగీతం; కమలాకర కామేశ్వరరావు చిత్రీకరణ; జానకి–ఘంటసాలల గానమాధుర్యం; రాకుమారుడంటే యిలానే వుండాలన్న సుమనోహర రూపంతో ఎన్టీఆర్, ముగ్ధగా దేవకన్యల అభినయం ఆనాటి ప్రేక్షకుల సుకృతం. ధ్వని ప్రాధాన్యతకు పదప్రయోగాల్లో శబ్దాలంకారం (*జలకమాడు జవరాలిని; తడిసీ తడియని; విరిసీ విరియని పరువము మరులు; అగుపించని ఆనందం బిగికౌగిట*) విశేషంగా వాడి వీనులవిందు చేయడం కేవలం సినారెకే చెందిన ఘనత. దీన్ని ప్రాసయతి అనవచ్చని తెలుగు పండితులొకరు చెబుతూ, సినారెకి అది చాలా యిష్టం, అందులో ఆయనకి ఆయనే సాటి అన్నారు. అవును, తోటలో నా రాజు ... (ఏకవీర) పాటలో – *ఎలనాగ నయనాల కమలాలలో దాగి ఎదలోన కదలే తుమ్మెద పాట విన్నాను* పాదం, దాన్ని అజరామరంగా మలచిన ఘంటసాల గాత్రం గుర్తు తెచ్చుకుందాం.

గులేబకావళి కథ సినిమా విడుదలై యాభయి సంవత్సరాలు నిండి, *కలల అలలపై* ... గీతం ప్రౌఢగా మారిన సందర్భంలో, 2012 జనవరి 6న, దాన్ని యూట్యూబులో బంధించి నిత్య జవరాలిని చేసిన రసజ్ఞుడికి కృతజ్ఞతలు.

అవకాశం వున్నవాళ్ళు ఈ పాటని విడియోలో చూసి ఆ తరవాత కళ్ళు మూసుకుని మరోసారి వొట్టి ఆడియో వింటే అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనవుతూ సుమధురలోకంలోకి అడుగుపెట్టినట్టయి – మన వారసత్వం ఏం పోగొట్టుకుందా అని మనసు చివుకుమనడం ఖాయం.

– గబ్బిట కృష్ణమోహన్